క్లుప్తంగా

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధ రాత్రి శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి ఉత్సవం శ్రీముఖలింగంలో వైభవంగా నిర్వహించారు. లింగోద్భవం అనంతరం పార్వతీపరమేశ్వులను గజ వాహనంపై తిరువీధి చేపట్టారు. ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్నానాల రేవు పరిశీలన



రేవులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

ఎల్‌.ఎన్‌.పేట: మండలంలోని మిరియాపల్లి గ్రామం వద్ద వంశధార నదీ పక్షితీర్థం స్నానాల రేవును ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ గురువారం పరిశీలించారు. శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలకు అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రోప్ పార్టీతోపాటు ప్రత్యేక పోలీసు బందోబస్తును పెంచామన్నారు. రేవులో భక్తులు దిగి, వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేశామన్నారు. స్వామి వారి స్నానాలకు వచ్చి, వెళ్లే సమయంలో భక్తులు పోలీసులకు సహకరించాలన్నారు. వాహనాలతో వచ్చే భక్తులకు కొంచెం దూరంలో నిలిపేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమావతి, వీఆర్వో ఎల్‌.తిరుమల, గ్రామ పెద్ద లుకలాపు అనందరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



బారికేడ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ తిరుపతిరావు, ఏఈ సరోజ

ఎల్‌.ఎన్‌.పేట: వంశధార నదిలో శుక్రవారం జరిగే శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని నరసన్నపేట ఆర్‌అండ్‌బీ డీఈ ఎ.తిరుపతిరావు అన్నారు. ఎల్‌.ఎన్‌.పేట మండలం మిరియాపల్లి గ్రామం వద్ద వంశధార నదీ చక్రతీర్థ స్నానం రేవు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. వంశధార నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉందని, హిరమండలం బ్యారేజ్ నిర్వహణ ఇంజినీరింగు అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. చక్రతీర్థ స్నానాలకు వచ్చే భక్తుల స్నానాలకు ఇబ్బంది లేకుండా శుక్రవారం నాటికి నదిలో నీటి ప్రవాహం పెరుగుతుందన్నారు. సారవకోట ఆర్‌అండ్‌బీ ఏఈ జి.సరోజ ఉన్నారు.

అన్నదానం



అన్నప్రసాదంలో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శివాలయం వద్ద గురువారం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. శివుడి దర్శనానికి భక్తులు బారులు తీశారు. పాతపట్నంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న బెల్లం ఊటను చూపిస్తున్న సీఐ కృష్ణారావు, సిబ్బంది

పాతపట్నం: మండలంలోని సవర సిద్ధమనుగు పంచాయతీ పరిధిలోని బోన్ని సమీపంలోని ఆంధ్ర, ఒడిశా సరిహద్దు కొండ ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు చేశారు. 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని పాతపట్నం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో పాతపట్నం ఎస్‌ఐ డి.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

హిరమండలం: మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించాలని ఎంఈఓ కె.రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించి ప్రదర్శించాలన్నారు. మంచి ప్రాజెక్టులు చేసిన విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రోత్సహించి బహుమతులను అందించాలని కోరారు.

నవ ధాన్యాల సాగు..

లాభాలు బాగు



పద్మాపురం సమీపంలో నవ ధాన్యాల సాగు (ఫైల్)

- ప్రణాళికలు రూపొందించిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది
- గ్రామస్థాయిలో రైతులకు అవగాహన
- పంట పొలాల్లో తేమ శాతం పెంచేందుకు ఎంతో ఉపయోగం



బుడితిలో సేంద్రియ కషాయాన్ని తయారీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సారవకోట:నవ ధాన్యాల సాగు చేయడంతో లాభాలు అధికంగా ఉంటాయని రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ విధానం విలైనంత ఎక్కువగా రైతుల్లోకి తీసుకెళ్లి సాగు విస్తీర్ణం, భూమిసారం పెంచడంతోపాటు అధిక దిగుబడి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఏ విత్తనాలు వేసుకోవాలి

నవ ధాన్యాల సాగులో పచ్చిరొట్టతోపాటు పప్పు, నూనె, చిరు ధాన్యాలు, సువాసన, తదితర రకాలైన విత్తనాలు వినియోగించవచ్చు. దీంట్లో పెసర, మినుము, ఉలవలు, కందులు, సజ్జలు, రాగులు, జొన్నలు తదితర రకాల విత్తనాలు వినియోగించడంతో తొలకరి వర్షాలు కురిసే సమయంలో అవి మొక్కలవుతాయి. తరువాత వేసుకునే పంటకు అవసరమైన సూక్ష్మజీవులను అభివృద్ధి చేస్తాయి. దీంతో పాటు వివిధ రకాల విత్తనాలు ఈ నవ ధాన్యాల సాగులో వేయడం ఆయా రకం మొక్క వలన భూమి లోపలకు వేర్లు చొచ్చుకుని వెళ్లి నేలలో తేమ శాతాన్ని పెంచుతాయి. ఈ నవ ధాన్యాల సాగు అనంతరం వేసుకునే పంటకు కావాల్సిన తేమను ఇవి అందించేందుకు ఉపయోగపడతాయి.

ఈ విత్తనాలు ఎప్పుడు చల్లుకోవాలి

తొలకరి వర్షాలు కురిసే ముందు వరి పంట పొలాలను ఒకసారి దుక్కి దున్నుకుని ఎకరాకు 12 కేజీలు చొప్పున 25 రకాల విత్తనాలను చల్లుకోవాలి. తొలకరి వర్షాలు కురిసిన అనంతరం ఆ మొక్కలు రెండు అడుగుల ఎత్తు పెరిగిన తరువాత వాటిని కోయాలి. ఆ మొక్కలను పశువులకు మేతగా వినియోగిస్తే పశువులు బలంగా పెరిగి అధిక మోతాదులో పాలు అందించేందుకు ఉపయోగపడతాయి. మొక్కలు కోసిన తరువాత ఉన్న వేర్లను పూర్తిగా దున్నుకున్న తరువాత వరి పంటను వేసుకుంటే అధిక దిగుబడితోపాటు మానవ ఆరోగ్యాని ఉపయోగపడే పంట అందుతుంది.

నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ..

నరసన్నపేట నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవ ధాన్యాల సాగుపై ప్రచారం చేపడుతున్నారు. ఈ ఏడాది 5,216 ఎకరాల్లో రైతులతో నవ ధాన్యాల సాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది అనుకున్న స్థాయిలో నవ ధాన్యాల సాగు చేయిందుకు అన్ని విధాలా ప్రయత్నం చేశారు.

దిగుబడి పెరుగుతుంది



నవ ధాన్యాల సాగుతో ప్రస్తుతం రైతులకు వస్తున్న దిగుబడి కంటే అదనంగా రెండు నుంచి మూడు బస్తాల దిగుబడి పెరుగుతుంది. నేల సారం పెరిగి, వరి పంటకు అవసరమైన సూక్ష్మజీవులు పెరగడంతోపాటు తేమ, పోషకాలు అందిస్తాయి. రైతులు నవ ధాన్యాల సాగుపై దృష్టి సారించాలని తమ వంతు కృషి చేస్తున్నాం.

– తోట రమణ, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ, నరసన్నపేట

50 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను..



పద్మాపురం గ్రామానికి సమీపంలో నాకున్న 50 ఎకరాల్లో పూర్తిస్థాయిలో సేంద్రియ పద్ధతుల్లో అన్ని రకాల పంటలను సాగు చేస్తున్నాను. నవ ధాన్యాల సాగు చేపట్టడంతో భూమి సారం పెరిగింది. దాని వలన పంటల దిగుబడి బాగుంది.

– రావాడ మోహనరావు, రైతు, పద్మాపురం, సారవకోట మండలం

ట్రాఫిక్ ఇక్కట్లు



ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. పగలే గడ్డి ట్రాక్టర్లు పదుల సంఖ్యలో ప్రయాణించడంతో వాహనదారులు ట్రాఫిక్ ఇక్కట్లుకు గురవుతున్నారు. గడ్డి ట్రాక్టర్లను నివారించాల్సిన పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ట్రాక్టర్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పాలకొండ, హిరమండలం తదితర ప్రాంతాల నుంచి ఈ గడ్డి టాక్టర్లు విశాఖపట్నానికి తరలిస్తున్నారు. ఆమదాలవసలో బొడ్డేపల్లిపేట నుంచి వైఎస్సార్ కూడలి వద్ద, బ్రిడ్జిపైన నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు పడుతున్నామని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దీనిపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- ఆమదాలవలస

హడలెత్తిస్తున్న కుక్కలు



ఆమదాలవలస పట్టణంలోని రైల్వే స్టేషన్ జంక్షన్, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, గాంధీ జంక్షన్, కొత్తకోటవారివీధి, కాలేజీ వీధి జంక్షన్ వద్ద ఉదయం, రాత్రి సమయంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి వేళలో ప్రయాణికుల వెంటపడుతున్నాయి. పట్టణ వాసులు రాత్రి వేళలో ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇటీవల పట్టణంలో పలువురికి కుక్కలు కాటేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రాత్రి వేళలో కుక్కల అరుపులతో నిద్దరపట్టడం లేదని పలువురు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఆమదాలవలస

తవ్వేసి.. వదిలేశారు!



నిత్యం వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే పాతపట్నం ఆల్ ఆంధ్ర రోడ్డు, మెళియాపుట్టి వెళ్లే ప్రధాన రహదారిలో మలుపుల్లో రెండు గోతులు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. మెళియాపుట్టి మండలం చింతపల్లి నుంచి పాతపట్నం కోర్టు కూడలి వద్ద ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు కేబుల్ లైన్ కోసం గతకొద్ది రోజుల క్రితం గోతులను తీసి, ఇప్పటికీ అలాగే వదిలేశారు. పాతపట్నం నుంచి మెళియాపుట్టి, పలాస వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతోపాటు మలుపు పక్కన గోతులు ఉండటంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే గోతులను పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- పాతపట్నం

ప్రయాణికుల పాట్లు



ఈ చిత్రం ఎల్‌.ఎన్‌.పేట మండలం బొర్రంపేట వద్ద గోతులమయంగా ఉన్న ఏబీ రోడ్డు. మండలంలోని అలికాం–బత్తిలి (ఏబీ) ప్రధాన రోడ్డు గోతులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గోతుల రోడులో ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉందని ద్విచక్ర వాహనదారులు, ఆటో యజమానులు ఆందోళన చెందుతున్నారు. గోనెపాడు కూడలి, బొర్రంపేట నుంచి ముంగెన్నపాడు రోడ్డు వరకు గోతులమయంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు 'సంక్రాంతికి చక్కటి రోడ్లు..' అని ప్రచారం చేశారు. శివరాత్రి దాటిపోతున్నా రోడ్లు బాగుపడలేదని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

- ఎల్‌.ఎన్‌.పేట

భక్తిశ్రద్ధలతో లింగోద్భవం



సారవకోట: బియ్యంతో అలంకరించిన శివ లింగం



సరుబుజ్జిలి: పూలు, పండ్లతో శివలింగం అలంకరణ



సారవకోట: అవలింగిలో విభూదితో శివ లింగం అలంకరణ

సారవకోట: మండలంలోని అవలింగి మల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం లింగోద్భవ కార్యక్రమం నిర్వహించారు. మహా శివరాత్రి అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించామని అర్చకులు తెలిపారు. దీంట్లో భాగంగా శివ లింగాన్ని విభూదితో అలంకరించారు. సారవకోట గ్రామంలోని సోమనాధీశ్వర స్వామి ఆలయంలో శివ లింగాన్ని బియ్యంతో అలంకరించారు.

ఉమాకామేశ్వరస్వామి ఆలయంలో..

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం ఉమాకామేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధ రాత్రి తరువాత అర్చకులు గంగవరపు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో లిందోగ్భవ కార్యక్రమం నిర్వహించారు. శివ లింగానికి నాగాభరణం ఏర్పాటుచేసి తెల్లని వస్త్రం చుట్టి బియ్యం, పండ్లు, పూలు వేశారు. లింగోద్భవం జరిగిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు.

చక్రతీర్థస్నానాలు..

ఉమాకామేశ్వరస్వామి వారి చక్రతీర్థస్నానాలు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి వంశధార నదిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అర్చకులు ప్రకటించారు.

అన్న సంతర్పణకు ఏర్పాట్లు



దబ్బపాడు వద్ద ఏర్పాట్లు చేస్తున్న గ్రామస్తులు

ఎల్‌.ఎన్‌.పేట: మండలంలోని దబ్బపాడు గ్రామం వద్ద భక్తులకు అన్నసంతర్పణ చేసేందుకు ఏర్పాట్లు చేశామని గురువారం దబ్బపాడు మాజీ సర్పంచ్ జమ్మి మోహన్‌రావు తెలిపారు. శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలకు వచ్చే భక్తులు, యాత్రికులు మధ్యాహ్నం భోజనం కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు దాతల సహకారంతో అన్నసంతర్పణ ఏర్పాటు చేశామన్నారు. సుమారు పది వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేస్తామన్నారు. భక్తులు అన్నదానంలో పాల్గొనాలన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఆమదాలవలస నియోజకవర్గంలోని ఆమదాలవలస బూర్జ, పొందూరు, సరుబుజ్జిలి, నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట, పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, కొత్తూరు, ఎల్‌.ఎన్‌.పేట, హిరమండలం, మెళియాపుట్టి మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 144 సెక్షన్ విధించారు. ఎలక్షన్ అబ్జర్వర్లు పర్యవేక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు



నరసన్నపేట: బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసరావు



నరసన్నపేట: ఓటు వేసేందుకు వచ్చిన దివ్యాంగ ఉపాధ్యాయుడు నర్సింగరావుకు సహకరిస్తున్న పోలీస్ సిబ్బంది



పాతపట్నం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి



సారవకోట: ఓటు వేసిన అనంతరం సిరా గుర్తులు చూపిస్తున్న ఉపాధ్యాయులు



జలుమూరు: ఎన్నికల పక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు



పొందూరు: పోలింగ్ బూత్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు



హిరమండలం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఎండీ యాసిన్



పోలాకి: ఎన్నికల కేంద్రం వద్ద ఓటును పరిశీలిస్తున్న సిబ్బంది



బూర్జ: ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీస్తున్న తహసీల్దార్ వై.వి పద్మావతి



ఎల్‌.ఎన్‌.పేట: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సరుబుజ్జిలి: ఈ నెల 28వ తేదీన సరుబుజ్జిలి 11 కేవీ పరిధిలోని రొట్టవలస ఫీడర్‌లో మరమ్మతులు చేయనున్నారు. ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మర్రిపాడు, షళంత్రి, కొత్తకోట, కొండ్రగూడ, వెన్నెలవలస, చిగురువలస, సుభద్రాపురం, రొట్టవలస, కొండవలస, రావివలస, పాలవలస, పెద్ద, చిన్నపాలెం, పురుషోత్తపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆమదాలవలస పట్టణంలో..

ఆమదాలవలస: ఈ నెల 28వ తేదీన పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ మెట్టక్కివలస టౌన్–2 ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెట్టక్కివలస అమ్మానగర్, కుప్పిలివారి వీధి, ఊసవానిపేట, అలమాజీపేట వాటర్ పంపు షెడ్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు చక్రతీర్థ స్నానాలు

హిరమండలం: మండల కేంద్రంలోని చిన్న కోరాడలో గల ఉమా రుద్రకోటేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు.